తెలంగాణ ప్రజలే బీఆర్‌ఎస్‌కు బాస్‌లు

● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

రసూల్‌పురా: తెలంగాణ ప్రజలే బీఆర్‌ఎస్‌కు బాస్‌లని ఢిల్లీ పార్టీలతో ఒరిగేదేమీ లేదని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డీబీ. దేవేందర్, సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్, బీజేపీ నేత రుక్మయ్య, ఎంఐఎం నాయకులు వాహెబ్, ముఖ్రం తదితరులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కంటోన్మెంట్ వికాస్ మంచ్ నేతలు ఏబెల్, సంకి రవిందర్, ఫస్సీ తదితరులు బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్‌లో ఎన్నికలు జరగకముందే సీఎం కుర్చీ కోసం నేతలు తాను సీఎం అంటూ ప్రకటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి లాస్యనందిత, రాష్ట్ర బెవరేజీస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, ఇన్‌చార్జి ఎమ్మెన్ శ్రీనివాస్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జే. మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, శ్యామ్, పాండుయాదవ్, లోక్‌నాథ్. మార్కెట్ కమిటీ సభ్యులు, వివిధ ఆలయాల చైర్మన్లు పాల్గొన్నారు.

రూ. 1400 కోట్లతో అభివృద్ధి పనులు..

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గంలో రూ. 1400 కోట్లతో అనేక ప్రజాభివృద్ధి పనులు చేపట్టి అమలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఆ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా మార్కెట్ డివిజన్‌లో గురువారం ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పనులు చేశాం కాబట్టి ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు తమకే ఉందన్నారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రజల కనీస సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీ, వరదనీటి కాలువల అభివృద్ధి, పార్కుల ఆధునికీకరణ వంటి అనేక పనులు చేపట్టామన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం డబుల్ బెడ్రూమ్ నిర్మాణంతో రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. అంతకు ముందు ఆయన బండిమేట్, ఆదయ్యనగర్‌లో బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రూప, నాగులు, స్కైలాబ్, సత్యనారాయణ, అమర్, జయరాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో హ్యాట్రిక్ ఖాయం



ఓటర్లకు సమస్కరిస్తున్న పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: సికింద్రాబాద్‌లో తమ పార్టీ హ్యాట్రిక్ సాధించనుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం రాత్రి బౌద్ధనగర్ డివిజన్‌లోని జామై ఉస్మానియా గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ..ఎన్నికల్లో తమ పాదయాత్రకు మంచి స్పందన లభిస్తోందని తమ విజయానికి కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. తమ గెలుపు ఖాయమని, మెజారిటీ కోసం కృషి చేస్తున్నామన్నారు. అదే విధంగా సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అనుకూల ప్రచారం ముమ్మరం చేయాలని సూచించారు. ప్రచారంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, సునీత, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేశాం..

బౌద్ధనగర్: సికింద్రాబాద్‌లో తమ విజయం ఖాయమని కాలనీలు, బస్తీలు తేడా లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేశామని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. గురువారం స్థానిక కార్పొరేటర్ కంది శైలజతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడకుండా రాజకీయాలకు అతీతంగా వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేశామని, సికింద్రాబాద్‌ను అభివృద్ధిలో నడుపుతున్నామన్నారు. పదేళ్లలో తాము చేపట్టని పనులు లేవని, అన్ని మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తూ వచ్చామన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాముఖ్యాన్ని కల్పిస్తూనే సంక్షేమ కార్యక్రమాల్లో సికింద్రాబాద్‌ను అగ్రభాగంలో నిలిపినట్లు పేర్కొన్నారు. ప్రచారంలో డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, కార్పొరేటర్లు సునీత, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీకి టీడీపీ, బీఆర్‌ఎస్‌కు పీవీఎం మద్దతు



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన వికాస్ మంచ్ సభ్యులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో టీడీపీ కార్యవర్గం బీజేపీకి మద్దతిస్తున్నట్లు ఆ పార్టీ నేత మధుసూదన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తమ పార్టీ అధిష్ఠానం ఆదేశంతోనే తాము ఇకపై కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్ గెలుపుకోసం పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ, మధుసూదన్, ప్రతాప్, అంజయ్య, కట్టెల శ్రీనివాస్ యాదవ్, చంద్ర శేఖర్, వెంకట్ రావు, కైలాస్ గౌడ్, రుకేష్, శ్రీను,రాము, ఆనంద్, శ్రీకాంత్, నాగరాజు,పి. శ్రీను, సుదర్శన్, అనురాధ పాల్గొన్నారు.

◆ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనానికి మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్‌కు తమ కంటోన్మెంట్ వికాస్ మంచ్ (సీవీఎం) మద్దతు ఇస్తుందని సీవీఎం ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ ప్రకటించారు. ఈ మేరకు సీవీఎం అధ్యక్షులు ఏబెల్‌తో పాటు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి మద్దతు తెలిపారు. కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందిత గెలుపునకు తాము సహకరిస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌కు నాగినేని సరిత గుడ్‌బై



కన్నీటి పర్యంతమవుతూ మాట్లాడుతున్న నాగినేని సరిత

రసూల్‌పురా: కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ జాగృతి కంటోన్మెంట్ కన్వీనర్ బీఆర్‌ఎస్ 7వ వార్డు మహిళా అధ్యక్షురాలు నాగినేని సరిత రాజీనామా చేశారు. లాల్‌బజార్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి లాస్య నందిత నిర్లక్ష్య వైఖరి కారణంగా తాను బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు స్పష్టం చేశారు. గత 14 ఏళ్లుగా పార్టీకి ఎంతగానో సేవలందించానని సాయన్న బతికున్నప్పుడు తనకు తగిన ప్రాధాన్యం ఇచ్చేవారని ఆయన మరణానంతరం నాయకులు ఎవరు అండగా లేకున్నా తాము వెన్నంటూ ఉన్నామన్నారు. గత కొన్ని నెలలుగా తమ పట్ల లాస్యనందిత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పొమ్మనలేక పొగ పెడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. తాను పార్టీని వీడిన ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. తన సేవలను గుర్తించి బీజేపీ నాయకులు ఆ పార్టీలోకి ఆహ్వానించారని కార్యకర్తలతో పెద్దఎత్తున బీజేపీలో చేరుతున్నానని ఆమె పేర్కొన్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ అనుబంధాల సమావేశం

రసూల్‌పురా: ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశం రేపు (18న) క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ తెలిపారు. గురువారం ఆయన సమావేశ ఏర్పాట్లను ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి 30 ఏళ్ల పోరాటానికి ముగింపు ఇస్తామని విశ్వరూప మహాసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం మాదిగ ప్రజల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించే జాతీయ కార్యవర్గ సమావేశానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పాల్గొంటున్నారని చెప్పారు. శ్రీ కిషన్ మాదిగ, కళ్యాణ్ అజిత్, పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్స్‌కు సృష్టి.. పారిశ్రామిక బస్తీ

ఆరేడు దశాబ్దాల క్రితమే పురుడుపోసుకున్న సాంకేతికత

- డబుల్ డెక్కర్ డిజైన్.. శక్తిమాన్ ట్రక్స్, గన్స్ తయారీకి కేంద్ర బిందువు
- పారిశ్రామికవాడ నుంచి రాజకీయంగా ఎదిగిన నేతలు
- ఆ ప్రాంతంపైనే అభ్యర్థుల దృష్టి

సనత్‌నగర్: 1952లో జరిగిన మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల కోసం బ్యాలెట్ బాక్స్ రూపు దిద్దుకున్న ప్రాంతం.. ప్రయాణపు మధురానుభూతులను పంచే డబుల్ డెక్కర్ బస్సు డిజైన్..ఇండియన్ ఆర్మీ కోసంశక్తిమాన్ ట్రక్స్ తయారీకి పునాది.. నిజాం పాలకుల రక్షణార్థం ఆనాడే గన్స్ తయారు చేసిన చోటు అది. ఇంతటి కీర్తిని మూటగట్టుకున్న ప్రాంతం మరెక్కడో కాదు.. అదే సనత్‌నగర్. పారిశ్రామికవాడ అనే పదం రాష్ట్రానికి ఇంకా పరిచయం కాకముందే ఇంతటి ఘనకీర్తిని మన నగరం మూటగట్టుకుంది. నిజాంకు చెందిన హైదరాబాద్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, అల్లావుద్దీన్ అండ్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో ఎన్నెన్నో అద్భుతాలు, సాంకేతిక విప్లవానికి సనత్‌నగర్ ప్రాంతం కేంద్రంగా నిలిచింది. రాజకీయంగా కూడా ఈ ప్రాంతం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడి పారిశ్రామికవాడ నుంచి కార్మిక నేతగా జీవితాన్ని ఆరంభించి రాజకీయాల్లో చక్రం తిప్పిన వారెందరో. శ్రీనివాస్‌యాదవ్, పీజేఆర్, ఆలె నరేంద్ర, వెంకటస్వామి, రామదాస్, సంజీవరెడ్డి, బంగారు లక్ష్మణ్, చింతల రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, పీఎల్ మహేందర్, ఇంద్రారెడ్డి వంటి రాజకీయ దిగ్గజ నేతలు ఇక్కడ కార్మిక యూనియన్ నేతలుగా పనిచేసిన వారే.

ఏర్పడింది ఇలా..

స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశాన్ని పాలిస్తున్న సమయంలో అప్పటి నిజాం పరిపాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానాన్ని 1948లో విలీనం చేసిన విషయం తెలిసిందే. విలీనం అనంతరం సనత్‌నగర్ ప్రాంతంలో అల్లావుద్దీన్ కేంద్ర ప్రభుత్వం నుంచి 408 ఎకరాల భూమిని అప్పటి ప్రప్రథమ రాష్ట్రపతి ద్వారా తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తదనంతరం కేంద్ర కార్మిక సంస్థ ఇక్కడి దాదాపు 150 ఎకరాల్లో చిన్నతరహా పరిశ్రమలు నిర్మించుకోవడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం అల్లావుద్దీన్ నుంచి భూమిని సేకరించింది. అలా సేకరించినదే సనత్‌నగర్ పారిశ్రామికవాడగా నామకరణం జరిగింది. 'సనత్' అంటే పరిశ్రమగా పేర్కొంటారు. అందుకే మొట్టమొదటి పారిశ్రామికవాడ కావడంతో సనత్‌నగర్‌గా ఈ ప్రాంతం పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆల్విన్, ఆస్బెస్టాస్ వంటి దాదాపు 200 పరిశ్రమల స్థాపనకు నెలవైంది.

నాటి కార్మికగడ్డ, నేటి ఎస్‌ఆర్‌టీ..

సనత్‌నగర్ పారిశ్రామికవాడ ఎదురుగా దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఆనాటి కార్మికుల ఆవాసం కోసం ఏర్పాటు చేసినదే నేటి సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీ కాలనీ. దాదాపు 50 ఏళ్ల క్రితం దట్టమైన అడవుల మధ్య వ్యవసాయ క్షేత్రంగా ఉన్న ఈ ప్రాంతం పారిశ్రామికవాడ ఆవిర్భావంతో రూపురేఖలు మార్చుకుంది. ఎస్‌ఆర్‌టీ (సింగిల్ రూమ్ టెనెంట్స్) పేరిట 1500 క్వార్టర్స్ ఇళ్ల నిర్మాణం జరిపారు. అయితే 60 ఏళ్ల క్రితమే ఎంతో ముందుచూపుతో కాలనీ ప్రణాళికను రూపొందించారు. పారిశ్రామికవాడలోని పరిశ్రమలు కాలుష్యాన్ని వెదజల్లే అవకాశం ఉండే నేపథ్యంలో ఒక్క ఎస్‌ఆర్‌టీ కాలనీలోనే 52 పార్కులకు స్థలాల కేటాయింపు జరిపారు. వాటిని స్థానికులు ఇప్పటి వరకు కాపాడుకుంటూ వస్తున్నారు.

కీలకంగా ఆ ఓట్లు..

ఎస్‌ఆర్‌టీ కాలనీతో పాటు చుట్టుపక్కల కాలనీలు, బస్తీలు కార్మిక కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ సంస్కృతి వచ్చి కార్మిక కుటుంబాలతో పాటు సెటిలర్స్ నివాస కేంద్రంగా ఆవిర్భవించింది. ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్ (బీఆర్‌ఎస్), కోట నీలిమ (కాంగ్రెస్), మర్రి శశిధర్‌రెడ్డి (బీజేపీ)లు ఇక్కడి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రాజకీయంగా ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రచారం కొనసాగిస్తున్న అభ్యర్థుల్లో ఎవరు పారిశ్రామికవాడలో పాగా వేస్తారో వేచి చూడాల్సిందే.

రేపు కార్తీక వనభోజనాలు

సనత్‌నగర్: ఎస్సార్‌నగర్ కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో కార్తీక వనమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధి కొత్తపల్లి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.10 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో ప్రముఖ వక్తలు కుర్రా నరసింహారావు, వీరమాచనేని రమేష్‌బాబుల ప్రసంగ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత విభావరి, ప్రముఖులకు సన్మానంతో పాటు సహపంక్తి భోజనాలు ఉంటాయన్నారు.

కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

లాలాపేట: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 18న సికింద్రాబాద్ నియోజక వర్గంలో నిర్వహించనున్న మంత్రి కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ కోరారు. శనివారం మధ్యాహ్నం తర్వాత నియోజకవర్గంలోని అడ్డగుట్ట, సితాఫల్‌మండి మైలార్‌గడ్డ ప్రాంతంలో రోడ్డు షో ద్వారా కేటీఆర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారన్నారు.

సనత్‌నగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



తనకు ఓటేయాలని కోరుతున్న కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ ధీమా వ్యక్తం చేశారు. పాన్ బజార్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ గ్యారంటీలపై విశేష స్పందన లభిస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. అరచేతిలో స్వర్గం చూపుతూ బీఆర్‌ఎస్ సనత్‌నగర్ ప్రజలను మోసం చేస్తున్నారని ప్రజలు వాస్తవాలను గ్రహించారని బీఆర్‌ఎస్‌ను ఓడించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద ప్రజలు జీవితాలు మారిపోతాయన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్‌తో పాటు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. అంతకు ముందు మాజీ కార్పొరేటర్ శీలం ప్రభాకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో..

పద్మారావునగర్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు పార్టీ అభివృద్ధికి సోపానాలుగా నిలుస్తాయని కోట నీలిమ అన్నారు. పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. ప్రజలు కలలుగన్న తెలంగాణ కోసం కాంగ్రెస్‌కు ఎన్నికల్లో అండగా ఉంటారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓ సారి అవకాశం ఇవ్వాలన్నారు. అన్ని వర్గాలకు అభయహస్తంగా కాంగ్రెస్ అని పేర్కొన్నారు.

కేసీఆర్ కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

అడ్డగుట్ట: రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి మేకల సారంగపాణి ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మాణికేశ్వరినగర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి తుకారాం గేట్ రియోపాయింట్ హోటల్ వద్ద ముగించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లుగా మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తూ వస్తున్న కేసీఆర్‌ను ఈ సారి ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో నమ్మబోరన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు ఇవ్వకుండా కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పంపి పెట్టడం సిగ్గుచేటన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభంజనం నడుస్తోందని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రంలో బాగుపడింది కేవలం ఆయన కుటుంబ సభ్యులు మాత్రమేనని ఆరోపించారు. ప్రచారంలో కన్నాభిరాం, హంసరాజు, మహేష్‌గౌడ్, నరేందర్, రాజేష్, శారద మల్లేష్, పోచయ్య యాదవ్, గణేష్ ముదిరాజ్, సాయిబాబా పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ..

లాలాపేట: సికింద్రాబాద్ అసెంబ్లీ బరిలో ఉన్న బీజేపి అభ్యర్థి మేకల సారంగపాణిని గెలిపించాలని కోరుతూ గురువారం సికింద్రాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన బైక్ ర్యాలీని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. స్వయంగా ఆయన బైక్ నడుపుకుంటూ మాణికేశ్వర్‌నగర్ నుంచి బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, తార్నాక, శాంతినగర్ మీదుగా బైక్ ర్యాలీ కొనసాగింది.



ఆకట్టుకునేలా.. ఓట్లు పడేలా

ఎన్నికల ప్రచారాల నేపథ్యంలో అభ్యర్థులు ప్రజలను ఆకర్షించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రచారాలు చేస్తున్నారు. గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ నిర్వహించిన ప్రచారంలో యువతులు, మహిళలు నృత్యాలు చేస్తూ కొనసాగించారు. వారి ఆటపాటలు, ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

–బౌద్ధనగర్

వ్యర్థాల నిర్వహణపై అవగాహన

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో గురువారం 'వ్యర్థాల నిర్వహణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదకర వ్యర్థాలు, రసాయనాల నిర్వహణ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా నిపుణులు సూచించారు. అలాగే దుండిగల్‌లోని వ్యర్థాల నిర్వహణతో పాటు రోజువారీ వినియోగించే సౌందర్య సాధనాలకు సంబంధించి రసాయనాల వినియోగంపై ప్రాజెక్ట్ అధికారి నాగేశ్వరరావు సుదీర్ఘ ప్రసంగం చేశారు.

రౌడీషీటర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష

అడ్డగుట్ట: పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఓ రౌడీషీటర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై షాహీద్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన పవిత్ర దాస్(37) కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి లాలాపేటలోని శాంతినగర్‌లో నివాసముంటూ ప్లంబర్‌గా పని చేస్తుంటాడు. లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో నిందితుడైన పవిత్రదాస్‌పై రౌడీషీట్ నమోదైంది. ఓ కేసుకు సంబంధించి బుధవారం సైఫాబాద్ హాకా భవన్ లోని చిల్డ్రన్ ఫ్రెండ్లీ కోర్టులో పవిత్రదాస్‌ను కోర్టులో ప్రవేశపెట్టగా ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో రైలు కిందపడి ఇద్దరి ఆత్మహత్య

అడ్డగుట్ట: వేర్వురు ఘటనల్లో ఇద్దరు యువకులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజ్ వివరాల ప్రకారం.. దబీల్‌పురాకు చెందిన జింకల భరత్‌కుమార్(25) ప్రైవేటు ఉద్యోగి. ఇతనికి మానసిక స్థితి సరిగాలేదు. ఈ నెల 16న ఉదయం 10 గంటల సమయంలో దబీల్‌పురా–మేడ్చల్ స్టేషన్ల మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

సఫీల్‌గూడ రైల్వే స్టేషన్ ఎల్‌సీ గేట్ వద్ద..



సఫీల్‌గూడ రైల్వే స్టేషన్ ఎల్‌సీ గేట్ నంబర్ 10ఈ వద్ద సుమారు 25–30 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్‌పై వైట్, రెడ్ కలర్ చెక్స్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

17 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అడ్డగుట్ట: అక్రమంగా తరలిస్తున్న 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దయాకర్ కథనం మేరకు.. తుర్కపల్లికి చెందిన హుస్సేన్(26) వినోద్(25) అడ్డగుట్టలోని ఆజాద్‌చంద్రశేఖర్ నగర్‌లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆటోలో తరలించే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న సివిల్ సప్లయ్ అధికారులు, తుకారాంగేట్ పోలీసులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యం అక్రమ తరలింపును అడ్డుకుని హుస్సేన్, వినోద్‌పై కేసు నమోదు చేశారు.

'ఆరు గ్యారంటీ'లను 100 రోజుల్లోనే అమలుచేస్తాం

రసూల్‌పురా: పేదల పక్షాన ఉండే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జీవీ. వెన్నెల హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆమె రసూల్‌పురాలోని శ్రీలంక బస్తీ, సీబీఎస్‌నగర్, 105 గల్లీ, సిల్వర్ కాంపౌండ్ డబుల్‌బెడ్రూమ్ బస్తీల్లో ఇంటింటికి తిరిగి హస్తం గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పీసీసీ సెక్రటరి ఆవుల బాల్‌రాజ్, స్థానిక నాయకులు యాదగిరి, నాసర్ హుస్సేన్, వినోద్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నాయకులు బోర్డు ఖజానాను దోచుకుంటున్నారు'



మాట్లాడుతున్న సదా కేశవరెడ్డి

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డుపై బీఆర్‌ఎస్ నాయకులు దొంగల్లపడి దోచుకుంటున్నారని దొడ్డిదారిన రాష్ట్ర ఖజానాకు నిధులు తరలించుకుంటున్నారని బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, బీజేపీ నాయకులు సదా కేశవరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నివాసముంటున్న ప్రజల అభివృద్ధికి వినియోగించాల్సిన అన్ని రకాల పన్నుల నిధులను తమ ఖజానాకు తరలించి రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటూ బోర్డు పరిధిలోని ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఫైనాన్స్ కమిషన్ నిధులు వినియోగిస్తున్నామన్నారు. కంటోన్మెంట్ ప్రజలు ఆలోచించి ఓటేయాలన్నారు. దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకంలో అక్రమాలు, డబుల్ బెడ్రూమ్ కేటాయింపులో అవినీతి ఇది బీఆర్‌ఎస్ నాయకుల చరిత్ర అని విమర్శించారు. ఈ సమావేశంలో జబ్బార్, మణికంత, బాల్‌రాజు అశోక్, రవి ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కాళీమాత విసర్జనోత్సవం



పూజలు చేస్తున్న బెంగాలీలు

రాంగోపాల్‌పేట్: పాట్ మార్కెట్ బెంగాలీ పూజ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాళీమాతా విసర్జనోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది దీపావళి రోజు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం విసర్జనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా రాజేశ్వరీ థియేటర్ ప్రాంతంలోని జైన్ మందిర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారిని గురువారం రాత్రి బ్యాండు మేళాలు నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాజేశ్వరీ థియేటర్ నుంచి మోండా, సుభాష్‌రోడ్, బాటా, బైబిల్ హౌజ్ మీదుగా హుస్సేన్ సాగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం విసర్జనం చేశారు.అసోసియేషన్ ప్రతినిధులు సంతు జాన్, భావేష మైతి, సంజోయ్ జాను, రాంచంద్ర దాస్, సూరజ్ మన్నా పాల్గొన్నారు.

తలసానికి మద్దతుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న బాల్‌రాజ్ యాదవ్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి ఎస్. బాల్‌రాజ్ యాదవ్‌తో కలిసి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేస్తూ తలసాని చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. బన్సీలాల్‌పేట్, చాచానెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో లక్ష్మీపతి, అరుణ్‌గౌడ్, ప్రేమ్, విజయ్ శంకర్, సాగర్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బేగంపేట డివిజన్‌లో బీజేపీ..

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డలో పదేళ్ల క్రితమే జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద పూర్తయిన ఇళ్లను లబ్ధిదారుల కేటాయింపులో జాప్యం చేయడంలో ఆంతర్యమేమిటని సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బేగంపేట డివిజన్‌లోని ఎయిర్‌లైన్స్ కాలనీ, దేవిడీ బస్తీ, పాటిగడ్డ, నూర్‌బాగ్ ప్రాంతాల్లో ఆయన ఇంటింటి పాదయాత్ర చేశారు. కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. తనను గెలిపిస్తే పాటిగడ్డ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేలా కృషి చేస్తానన్నారు.